క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : అధిక శ్రావణమాస అమావాస్య సందర్భంగా బుధవారం శ్రీ లక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ ట్రస్టు నిర్వాహకుడు శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రతి అమావాస్యరోజు కాల భైరవ స్వామికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాహనంలో పట్టణంలోని కొర్రపాడు రోడ్డు, మైదుకూరు రోడ్డు, టీబీరోడ్డు తదితర ప్రాంతాల్లో భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

మైదుకూరు : ఓపెన్ స్కూల్లో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని మైదుకూరు జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ ఎం.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అందరికి విద్యను అందించాలనే ఆశయంతో ప్రభుత్వం సార్వత్రిక విద్యాపీఠాన్ని నెలకొల్పిందని ఆమె పేర్కొన్నారు. మధ్యలో బడి మానేసిన వారు, ఎలాంటి విద్యార్హత లేని వారు కూడా నేరుగా టెన్త్ పరీక్షలు రాయవచ్చని తెలిపారు. టెన్త్ పూర్తయిన వారు ఇంటర్ చదవవచ్చని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల్లో హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని వివరించారు. ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రమైన జెడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈనెల 30న అడ్మిషన్లకు చివరి తేదీ అని పేర్కొన్నారు.

మంచి పేరు తీసుకురావాలి

రాజుపాళెం : విద్యార్థులంతా కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరును తీసుకురావాలని టంగుటూరు సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా సామగ్రికి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి ఇచ్చిన రూ.25 వేలు నగదును ఆయన మామ గోనా వెంకటసుబ్బారెడ్డి బుధవారం హెచ్ఎం జి.ప్రభావతికి వితరణగా అందించారు. దీంతో హెచ్ఎంతో పాటు పీడీ చంద్రఓబుళ రెడ్డి, ఉపాధ్యాయులు గౌతమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సేవలకు పురస్కారం



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విష్ణుప్రియ

గోపవరం : బ్రాహ్మణపల్లె సచివాలయ మహిళా పోలీసు బోవిళ్ల విష్ణుప్రియకు సేవా పురస్కారం లభించింది. కడపలోని జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. 2022–23 సంవత్సరంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు గాను ఆమె పురస్కారం అందుకున్నారు. దీంతో తోటి సచివాలయ సిబ్బంది విష్ణుప్రియకు అభినందనలు తెలియజేశారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామ పంచాయతీలోని గుంతచీపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనున్నామన్నారు. 104 వాహనం ద్వారా అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి తెలియజేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సిమెంట్ రోడ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉమాదేవి

పోరుమామిళ్ల : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ తోకలపల్లెలో గడప గడపకు కార్యక్రమంలో బుధవారం సీసీ రోడ్డును సర్పంచ్ బీరం ఉమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతంలో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పంచాయతీకి వచ్చే నిధులతో అన్ని గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల : బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అన్నారు. బుధవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతన జీవులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని కోరారు.

ఉచిత బీమా కల్పించడం హర్షనీయం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఇటీవల నియమించిన గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఉచిత బీమా కల్పించడం హర్షనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం మీరు చేస్తున్న కృషిని గుర్తించి అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అందరికి సొంత డబ్బు చెల్లించి బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. కేవలం పార్టీపై అభిమానంతో మీరు పని చేస్తున్నారన్నారు. తన దృష్టిలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదని, కార్యకర్తలు, నాయకులు అందరూ సమానమేనన్నారు. అందరికి పార్టీలో సముచిత స్థానం, గౌరవం దక్కుతుందన్నారు. నియోజకవర్గానికి రూ.1314 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో డబ్బు జమ అయిందని, 24వేల ఇళ్లను నిర్మిస్తున్నామని వివరించారు. అందరూ ఐకమత్యంతో పనిచేయాలని, ఏమైనా సమస్యలుంటే నేరుగా తనతో మాట్లాడవచ్చన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి, పట్టణ సచివాలయ కన్వీనర్లు కాకర్ల నాగేశ్వరరెడ్డి, పోసా భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, రాజుపాళెం మండల సచివాలయ కన్వీనర్ వెలవలి రాజశేఖరరెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డితోపాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనుమతి లేని ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

గోపవరం : బద్వేలు పట్టణంలోని న్యూ వీరబ్రహేంద్ర సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో అనుమతి లేని ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏఓ అరవిందనాయక్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, పోలీసుశాఖ సంయుక్తంగా ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా రూ.13,600లు విలువ చేసే 22 బస్తాల ఎరువులు, రూ.9,600లు విలువ చేసే 4 బస్తాల విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏఓ తెలిపారు. నాణ్యత కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయించాలన్నారు. బిల్లులతో పాటు అమ్మకాలు, కొనుగోళ్లను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత అధికారుల అనుమతి మేరకు మొలక శాతం పరిశీలించిన తర్వాతనే విత్తనాలను రైతులకు విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. ఏ రోజు కారోజు ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్సులు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో బద్వేలు అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, వ్యవసాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గౌను గుర్తుకు ఓటేయండి



రాజుపాళెంలో ఇంటింటి ప్రచారంలో నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజుపాళెం : రాజుపాళెంలోని 9వ వార్డులో గౌను గుర్తుకు ఓటు వేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంద్రసేన రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఆ వార్డులో బుధవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ పెరుమాళ్ల నాగయ్యకు సంబంధించి గౌను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గతంలో, ఇప్పటికీ గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవడం బాధ్యత



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సీఐఎస్ఎఫ్ అధికారులు

బద్వేలు అర్బన్ : దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐ జీ.పీ.కె.మూర్తి పేర్కొన్నారు. నా మట్టి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండటంతోపాటు దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల స్ఫూర్తితో దేశ రక్షణకు కృషి చేయాలన్నారు. నా మట్టి – నా దేశం కార్యక్రమం ద్వారా జాతీయత, సమైక్యత భావాన్ని పెంపొందించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఎస్ఎస్‌బీ ఎస్ఐ పాలెం రఘునాథరెడ్డి, సీఐఎస్ఎఫ్ జవాన్ డి.ఎన్.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి విరుద్ధంగా వ్యవహరించడం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తీరు సరిలేదని ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని 13వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి శివచంద్రారెడ్డి సంప్రదాయానికి విరుద్ధంగా.. చనిపోయిన వార్డు మెంబర్ మురళీధర్‌రెడ్డి భార్యను పోటీ నుంచి తప్పించి తన కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిని పోటీలో నిలిపారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వార్డు మెంబర్‌గా పేరం బ్రహ్మానందరెడ్డిని పోటీలో నిలిపారన్నారు. అయితే శివచంద్రారెడ్డి తాను వైఎస్సార్‌సీపీనే అంటూ టీడీపీ నాయకులను సంప్రదించి ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారన్నారు. టీడీపీ నేతలు సీఎం సురేష్ నాయుడు, బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, బీటెక్ రవి, వరదరాజులరెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డితోపాటు అందరినీ ఆశ్రయించారని తెలిపారు. సెల్‌ఫోన్ రికార్డులో కూడా ఆధారం ఉందని చెప్పారు. శివచంద్రారెడ్డి సర్పంచ్ అయినప్పటి నుంచి ఇక్కడ ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చినప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మత్స్య కాలనీకి డ్రైనేజి కాలువ మంజూరు చేశారన్నారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి శివచంద్రారెడ్డి మత్స్య కాలనీకి ఏమి అభివృద్ధి పనులు మంజూరు చేశారో పంచాయతీ అజెండా చూపించాలని కోరారు. సర్పంచ్‌గా శివచంద్రారెడ్డి, ఉపసర్పంచ్‌గా ఆయన వదిన, వార్డు మెంబర్‌గా ఆయన సోదరుడు ఉండటంతోపాటు వారి కుటుంబంలోనే స్టేట్ డైరెక్టర్ పదవి కూడా ఉందన్నారు. అన్నీ కాదని మళ్లీ తన కుమారుడిని ఇక్కడ పోటీ చేయిస్తున్నారన్నారు. అభ్యర్థి పేరం బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ తాను స్థానికుడినని, చాలా ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ చేతనైన సహాయం చేస్తున్నానన్నారు. ఈనెల 19న జరిగే ఎన్నికల్లో తనను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ పేరం సునీత, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు సదస్సును విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : ఈనెల 18న కడపలో జరిగే ఉక్కు సదస్సును విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ బుధవారం ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. మన జిల్లాలో కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా ఉద్యమించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నారాయణ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవ, సూరి, నవీన్, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలో మండల పరిషత్ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరవుతారని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

గోపవరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు గురువారం మండల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆటో కార్మికులకు ఇంటి పట్టాలివ్వాలి

పోరుమామిళ్ల : ఆటో కార్మికులకు పోరుమామిళ్లలో ఇంటి పట్టాలివ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పట్టణంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవి కోరారు. బుధవారం ఆటో కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు జీవనం ఇబ్బందిగా గడుపుతున్నారని, పోలీస్, రవాణాశాఖ అధికారులు ఇస్తున్న ఈ– చలానాలతో భయపడుతున్నారన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ ఖాదర్, ఈశ్వరయ్య యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేక ఇబ్బందులు



ఫార్మసిస్టు లేక ఖాళీగా ఉన్న కుర్చీ

ఎర్రగుంట్ల : స్థానిక పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రగుంట్ల పీహెచ్‌సీకి ప్రతి రోజు ఓపీ అధికంగా ఉంటుంది. వైద్యులు రాసిన మందులను రోగులు తీసుకోవడానికి ఫార్మసిస్టు లేకపోవడం వల్ల తాత్కాలికంగా అక్కడే ఉన్న అనధికార సిబ్బందితో మందులను రోగులకు పంపిణీ చేయిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్టును డిప్యూటేషన్‌పై డీఎంహెచ్ఓ కార్యాలయంకు బదిలీ చేశారు. బదిలీ చేసి చాలాఏళ్లు కావస్తున్నా ఈ పీహెచ్‌సీకి ఫార్మసిస్టును వేయడంలో జిల్లా వైద్యాధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇక్కడ ఫార్మసిస్టును నియమించాలని రోగులు కోరుతున్నారు.

నేమ్ బోర్డుల్లో ఉర్దూను చేర్చడం పట్ల హర్షం

కడప కార్పొరేషన్/ కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధుల్లో ఏర్పాటు చేస్తున్న నేమ్ బోర్డుల్లో తెలుగు, ఇంగ్లీషుతో పాటు ఉర్దూను కూడా చేర్చడం సంతోషదాయకమని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా అన్నారు. నేమ్ బోర్డులను ఉర్దూలో కూడా రాయాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగరపాలక అధికారులకు విన్నవించామని, తమ విజ్ఞప్తిని మన్నించి ఉర్దూలో ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతిభగల వారికి కెనరా బ్యాంకు స్కాలర్‌షిప్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా విద్యాజ్యోతి కింద ప్రతిభావంతులైన ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు బ్యాంకు సీనియర్ మేనేజర్ సంపత్‌కుమార్ తెలిపారు. మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేశారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యా సంస్థ కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్ ఎస్సీ ఎస్టీ వర్గాలు స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ రత్న పాల్ పాల్గొన్నారు.

18న సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట

జమ్మలమడుగు : అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో పాటు ఏదైన గుర్తింపు కార్డుతో వచ్చి వేలం పాటలో పాల్గొన వచ్చునన్నారు.

మాలెపాడులో 24 మందిపై బైండోవర్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో శ్రీరామ గుడి విషయంపై ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు కోసం 24 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి బుధవారం తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఆర్టీపీపీలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఇంజనీర్లు

ఎర్రగుంట్ల : ఏపీఎస్‌బీ ఇంజనీర్స్ అసోసియేషన్, ఏపీఎస్ఈబీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల అసోసియేషన్‌ల పిలుపు మేరకు బుధవారం ఆర్టీపీపీలో విద్యుత్ ఇంజనీర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. విద్యుత్ ఇంజనీర్‌లకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నటువంటి పీఆర్‌సీ–2022ను వ్యతిరేకిస్తున్నట్లు వారు తెలిపారు. మహిళా ఇంజనీర్లు ఈ నిరసనలో పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలి



ప్రొద్దుటూరు కల్చరల్ : విజేతకు మెడల్స్ అందిస్తున్న వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్

ప్రొద్దుటూరు కల్చరల్ : యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం లింగాపురం వద్ద ఉన్న రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో విద్యార్థుల ప్రాజెక్టు స్పోర్ట్స్ మీట్‌ను వైస్ ఛాన్సలర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, క్రీడలు, యోగా, ఆరోగ్య పద్ధతులు నేర్పించాలని తెలిపారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్, ప్రాజెక్టు స్పోర్ట్స్ మీట్ డైరెక్టర్ పి.మధుసూదన బాబు మాట్లాడుతూ విద్యార్థులే క్రీడాకారులు, విద్యార్థులే న్యాయ నిర్ణేతలుగా ఉంటూ క్షేత్రస్థాయిలో క్రీడా నిర్వహణపై పట్టు సాధిస్తారని తెలిపారు. 100 మీటర్ల పరుగు పోటీలో విజేతలుగా నిలిచిన రాంనాయక్, మనీషాలకు వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మెడల్స్ అందించి అభినందించారు.

వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి తనిఖీ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజిని వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో భవనాలు అసంపూర్తిగా ఉండటానికి గల కారణాలను ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెంటనే తగు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం అకడమిక్ కన్సల్టెంట్లతో భేటీ అయ్యారు. ప్రతి విభాగంతోపాటు గ్రంథాలయం, మెకానికల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌ను సందర్శించి అక్కడి యంత్ర సామాగ్రి పరికరాలను పరిశీలించారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. వైస్ ఛాన్సలర్ విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ కేవీ రమణయ్య, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



తహసీల్దారు స్వాధీనం చేసుకున్న జేసీబీ

అట్లూరు : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దారు శ్రీవాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో కొంత మంది యంత్రాలు పెట్టి ప్రభుత్వ భూములను చదును చేస్తున్న సమాచారంతో తహసీల్దారు సిబ్బందితో అక్కడికి వెళ్లి చదును చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని తహసీల్దారు కార్యాలయానికి తీసుకువచ్చారు. తహసీల్దారు అక్కడికి వెళుతుందన్న సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారులు అక్కడి నుంచి పరారైయ్యారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నయో హద్దులు గుర్తించి వాటన్నింటికి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటి వరకు గ్రామ రెవెన్యూ సహాయకులను నిరంతరం కాపలా ఉండాలని తెలియజేశారు.

తైక్వాండోలో ఓఎల్ఎఫ్ బాలికల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : పట్టణంలోని ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు నాగదీపిక, ధనిషాలు తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల జమ్మలమడుగులో నిర్వహించిన సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్– 2023లో అండర్ – 15 విభాగంలో వారు గోల్డ్ మెడల్ సాధించారన్నారు. వారికి తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరి నాయబ్‌రసూల్ మెడల్, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్ అందించారన్నారు. బుధవారం విద్యార్థినులను పాఠశాలలో ఉపాధ్యాయులు విజయరాణి, సిస్టర్ జసింత, సరళ, జానీ, జయశీల, కావేరి, అనిత అభినందించారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు

G.O.P.No. 23/2022

1. పొన్నపురెడ్డి చంద్రబోస రెడ్డి, వయస్సు 17 సం॥, మైనర్.
2. పొన్నపురెడ్డి హిమంత్ రెడ్డి, వయస్సు 13 సం॥, మైనర్.
రెప్రసెంటెడ్ బై పొన్నపురెడ్డి మాధవి (మైనర్ల తల్లి)
D/05/140, MIG, APHB కాలని, ప్రొద్దుటూరు. ... పిటిషనర్లు

V/s

నిల్ ... రెస్పాండెంటు

జనరల్ నోటీస్

పై నంబరు G.O.P యందు పొన్నపురెడ్డి చంద్రబోస్ రెడ్డి, పొన్నపురెడ్డి హిమంత్ రెడ్డి మైనర్లయినందున వారికి గార్డియన్ అయిన పి. మాధవి క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ కోరి పై పిటిషన్ ను దాఖలు చేసియున్నది. అట్టి పిటిషన్ యందు ఏమైనా అక్షేపణలు యున్న యెడల ఎవరైనా పై కోర్టు యందు 30–08–2023 వ తేదీ ఉదయం 10:30 ని॥లకు హాజరు కావలయును. లేనంతల పరోక్షంగా తీర్మానించబడును.

Item No.1: YSR District, Proddatur Registration District, Proddatur Sub-District, Proddatur Mandal, Gopavaram Panchayat, Ward No.5, A.P. Housing Colony, House No. M.I.G. 140 (D.No. 5/140) in Proddatur Village fields R.C.C. Slab House and Vacant Site, The land in Circar Punji Survey No. 658 pyki 278 Square Yards Vacant site. Within this vacant site the said house bounded by: East: House bearing No. M.I.G 159, West :Lay out Road with 40 feet width, North:House bearing No. M.I.G. 141, South:Lay out Road with 50 feet width

Item No.2: YSR District, Proddatur Registration District, Proddatur Sub-District, Rajupalem Mandal, Velavali Panchayat, Velavali Village fields, The land in Circar Kushki Survey No. 631/1 Ac. 0-90 pura old cultivation **(patha sagu)** and Circar punji No. 631/2A pyki Ac. 1.03 Cents **(rasina)** jointly **(yeguvamudi) top knot**, total an extent of Ac. 1-93 Cents or 0.760 hectors.

With all easement rights.

టి.పద్మజ, అడ్వకేటు, ప్రొద్దుటూరు.